RNI NO APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
శనివారం, సెప్టెంబర్ 5, 2026

## జిల్లా ఉత్తమ హెచ్‌ఎం అవార్డుకు అజ్మీర జగన్ నాయక్



**టేకులపల్లి, సెప్టెంబరు 4 (తెలంగాణ వాణి):** టేకులపల్లి మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ), బోడు పీజీహెచ్‌ఎం అజ్మీర జగన్ నాయక్ జిల్లా స్థాయి ఉత్తమ హెచ్‌ఎం (ఎంఈఓ) అవార్డుకు ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా విద్యాశాఖ ఆయన సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని ప్రకటించింది. గతంలో మండల నోడల్ అధికారిగా సేవలందించిన జగన్ నాయక్ ప్రస్తుతం ఎంఈఓగా బాధ్యతలు నిర్వహించడంతో పాటు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఫైనాన్స్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. శనివారం జిల్లా కేంద్రంలో కలెక్టర్, డీఈఓ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు బానోతు లక్ష్మ, టి.రవీందర్, బి.రమేష్‌బాబు, రమణ తదితరులు జగన్ నాయక్‌కు అభినందనలు తెలిపారు.

## విలీన గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలి




**కొత్తగూడెం, సెప్టెంబరు 4 (తెలంగాణ వాణి):** కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో విలీనం చేసిన గ్రామాల్లో వెంటనే ఉపాధి హామీ పనులు కల్పించాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) జాతీయ కమిటీ సభ్యుడు మచ్చ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం అన్నవరపు కనకయ్య అధ్యక్షతన జరిగిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం కార్పొరేషన్‌తో పాటు అశ్వారావుపేట, ఇల్లందు, మణుగూరు మున్సిపాలిటీల్లో పలు గ్రామాలను విలీనం చేయడంతో గ్రామీణ కార్మికులు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు పొందే అవకాశాన్ని కోల్పోయారని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు విలీన గ్రామాల్లో వెంటనే వీబీజీ రామ్జీ పథకం కింద ఉపాధి పనులు కల్పించాలని కోరారు. అదేవిధంగా ఎల్1 లబ్ధిదారులందరికీ ఒకేసారి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, ఇళ్ల ఎంపికలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.చిరంజీవి, యాసా నరేష్, బందెల చంటి, సోలం నాగరత్నం, జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మల వెంకన్న, మర్మం చంద్రయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఎస్కే అబీద, ఊకే వెంకటేశ్వర్లు, కోట బాలకృష్ణ, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చర్చి నిర్మాణంలో నిరంతర సేవలు అందించిన యాదగిరికి ఘన సన్మానం



**రాయికోడ్ :సెప్టెంబర్ 4(తెలంగాణ వాణి ప్రతినిధి ):** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం ఇందూర్ గ్రామంలో నూతన చర్చి నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి.చర్చి నిర్మాణంలో భాగంగా శుక్రవారం చర్చి స్లాబ్ నిర్మాణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.చర్చి నిర్మాణం ప్రారంభమైన నాటి నుండి ఇప్పటివరకు ఎలాంటి స్వార్థం లేకుండా నిరంతరం శ్రమిస్తూ, నిర్మాణ పనుల్లో ముందుండి సేవలందించిన యువకుడు యాదగిరిని మండల మాదిగ సంఘం అధ్యక్షులు మీడిదొడ్డి శ్రీకాంత్ శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ, చర్చి నిర్మాణం కోసం ప్రారంభం నుండి యాదగిరి ఎంతో అంకితభావంతో కృషి చేస్తూ, ప్రతి దశలో తన వంతు సహకారం అందించారని కొనియాడారు. చర్చి నిర్మాణం పూర్తయ్యే వరకు ఇదే స్ఫూర్తితో అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు. సమాజ అభివృద్ధి కోసం యువత ముందుండి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యువ నాయకులు సురేష్, నాగేష్, దేవదాస్, టీచర్ నర్సిములు, అనిల్ కుమార్, మైలారం ఆనంద్, రాజు, సీమోన్, మోహన్, కొనింటి ఆనంద్, లక్ష్మణ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## సాధు సంత్‌లకు రూ.25 వేల గౌరవ వేతనం ఇవ్వాలి

**- హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి గ్రామంలో ఆలయాలు నిర్మించాలి**



**లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబరు 4 (తెలంగాణ వాణి):** గ్రామీణ ప్రాంతాల్లో హిందూ ధర్మ పరిరక్షణకు సేవలందిస్తున్న సాధు సంత్‌లకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ.25 వేల గౌరవ వేతనం అందించాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా సాధు సంత్‌ల జేఏసీ నూతన చైర్మన్ తేజావత్ రాములు నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మార్కెట్ యార్డులో నిర్వహించిన సాధు సంత్‌ల సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జేఏసీ చైర్మన్‌గా తేజావత్ రాములు నాయక్, గౌరవాధ్యక్షులుగా బానోత్ చందు, గుగులోత్ బిచ్చా, వైస్ చైర్మన్లుగా మాళోత్ రమేష్, జాటోత్ శంకర్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా భూక్య బాలు, ట్రెజరర్‌గా ధరమ్‌సోత్ లచ్చు, పలువురిని కార్యదర్శులుగా నియమించారు. ఈ సందర్భంగా రాములు నాయక్ మాట్లాడుతూ సాధు సంత్‌లు హిందూ ధర్మ పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. వారికి కనీస వేతనాలు, ప్రోత్సాహకాలు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అనంతరం నూతన కమిటీని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బంజారా సంఘాల జేఏసీ చైర్మన్ బానోత్ వీరు నాయక్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు మాళోత్ శివ నాయక్, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ కృష్ణ తదితరులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సాధు సంత్‌లు ఆంగోత్ రాజు, బిచ్చు, గురు ప్రసాద్, రాందాస్, రాంపాల్, సీతారాం, దస్రు, బాలు, వాంకుడోత్ బాలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలన పతనమే తెలంగాణకు శ్రీరామరక్ష

- వాగ్దానాలు 420.. అమలు శూన్యం
- రైతు, మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ తూట్లు
- కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ వంటా--వార్పు
- కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ సమరం
- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వర రావు







**కొత్తగూడెం, సెప్టెంబరు 4 (తెలంగాణ వాణి)** కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ఎదుట వంటా--వార్పు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కొత్తగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వర రావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500, రైతులకు రుణమాఫీ, రైతుబంధు, రైతుబీమా వంటి హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకే కేసీఆర్, కేటీఆర్ ఆదేశాల మేరకు వంటా--వార్పు కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వ పతనమే తెలంగాణకు శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్, కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, మాజీ ఎంపీపీలు, సర్పంచులు, మాజీ సర్పంచులు, ఉప సర్పంచ్, మాజీ ఉప సర్పంచులు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు వేల సంఖ్యలో పాల్గొన్నారు

## కృష్ణుడి వేషాల్లో చిన్నారుల సందడి

**- పద్మావతి కాలనీలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు**



**పెద్దపల్లి, సెప్టెంబరు 4 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):** శ్రీకృష్ణుడి నామస్మరణతో పద్మావతి కాలనీ మార్మోగింది. చిన్నారుల కృష్ణ, గోపికల వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలతో 49వ డివిజన్ పద్మావతి కాలనీలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పద్మావతి కాలనీ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు 49వ డివిజన్ కార్పొరేటర్ సాగి సంతోష్‌రావు, నడిపెల్లి మురళీధర్‌రావు ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రవికుమార్ నాగండ్ల ఆధ్వర్యంలో వేడుకలు కొనసాగాయి. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించగా, సాంస్కృతిక ప్రదర్శనలు, ఆట పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తల్లిదండ్రులు, మహిళలు, యువత, కాలనీ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఆస్వాదించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సాగి సంతోష్‌రావు మాట్లాడుతూ శ్రీకృష్ణుడు ధర్మం, ప్రేమ, స్నేహం, సమానత్వం, ధైర్యం, కర్తవ్యాన్ని ప్రపంచానికి బోధించిన మహనీయుడని అన్నారు. ఆయన బోధనలను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని సూచించారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రవికుమార్ నాగండ్ల మాట్లాడుతూ పిల్లలకు శ్రీకృష్ణుడి జీవితంలోని మంచి విలువలను చిన్ననాటి నుంచే పరిచయం చేయాలని అన్నారు. అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రాచర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ పండుగలు సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేసే వేదికలుగా నిలవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కాస సత్యనారాయణ, ట్రెజరర్ పెరటి రవీందర్‌రెడ్డి, కాలనీ పెద్దలు జాగిరి చంద్రమౌళి, పిట్ట లక్ష్మీనరసయ్య, అలిశెట్టి రమేష్, బండ శ్రీనివాస్, అంబటి సతీష్, కమిటీ సభ్యులు, మహిళలు, యువత, చిన్నారులు, కాలనీవాసులు పాల్గొన్నారు. కార్యక్రమానికి పారుపల్లి రాజలింగం వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

## కొత్తగూడెం క్లబ్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**కొత్తగూడెం, సెప్టెంబరు 4 (తెలంగాణ వాణి)** జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. క్లబ్ సెక్రటరీ కోనేరు పూర్ణచంద్రరావు సతీమణి కోనేరు పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. ఈ సందర్భంగా మహిళలు కృష్ణాష్టమి భక్తి గీతాలకు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. అనంతరం నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమం ఆకట్టుకుంది. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణుడిని పూజించారు. వేడుకల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని సందడి చేశారు. కార్యక్రమంలో కోనేరు దివ్య, తాటిపల్లి రాజేశ్వరి, కంభంపాటి విజయ, పలివేల గాయత్రి, ఇంటూరి సుగుణ, చెక్క కమల, మేక రత్న, పల్లపోతు కవిత, అయిత విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# హామీలు కొండంత.. అమలు మాత్రం శూన్యం




**- కాంగ్రెస్ 1000 రోజుల దగా పాలనపై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ధ్వజం**

**చిట్యాల, సెప్టెంబరు 4 (తెలంగాణ వాణి ప్రతినిధి):** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ 1000 రోజుల పాలనకు నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం చిట్యాల మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో వృద్ధులు, మహిళలు, వికలాంగులతో సదస్సు, వంటా-వార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులకు రూ.4 వేల పెన్షన్, వికలాంగులకు రూ.6 వేల పెన్షన్, రైతులకు రూ.15 వేల రైతు భరోసా వంటి హామీలతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు వంటి హామీలను కూడా ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. కేటీఆర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా వారం రోజుల పాటు నిరసనలు చేపడుతున్నామని తెలిపారు. “ఆరు గ్యారెంటీలు.. 420 హామీలు.. అమలు మాత్రం శూన్యం” అంటూ ప్రజల ఆవేదనను ఫ్లెక్సీల రూపంలో ప్రదర్శిస్తే వాటిని తొలగిస్తున్నారని, ఫ్లెక్సీలు తొలగించినంత మాత్రాన ప్రజల గొంతును అణచివేయలేరని అన్నారు. తప్పుడు కేసులతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను భయపెట్టలేరని స్పష్టం చేశారు. భూపాలపల్లి నియోజకవర్గంలో మీడియా ప్రతినిధులపై జరిగిన దాడులపై కూడా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. కార్యక్రమంలో మహిళలు, వృద్ధులు, వికలాంగులతో పాటు చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాలు, భూపాలపల్లి పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కన్నయ్య వేషధారణలో కనువిందుగా గంగుల దుర్గాంష్ అనే చిన్నయ్య



**కోరుట్ల:సెప్టెంబర్ 04 (తెలంగాణ వాణి)** శ్రీకృష్ణ జన్మాష్టమి (కృష్ణాష్టమి) వేడుకల్లో చిన్నపిల్లల ఆట పాటలు అత్యంత ప్రత్యేకమైన ఆకర్షణగా నిలుస్తాయి. కరీంనగర్ ఉమ్మడి జిల్లా కోరుట్ల పట్టణానికి చెందిన గంగుల దుర్గాంష్ అనే చిన్నయ్య కన్నయ్య వేషధారణలో కనువిందు చేశారు.బాల కృష్ణుని లీలలను స్మరించుకుంటూ చిన్నారులతో జరిపే వేడుకలు, ఆటల ఆహుతులను అలరిస్తాయి.

ఉట్ల పండుగ (ఉట్టి కొట్టడం ) కృష్ణాష్టమి అనగానే గుర్తొచ్చే ప్రధానమైనది వీధుల్లో ఎత్తైన ప్రదేశంలో పెరుగు, వెన్న, తీపి పదార్థాలతో కూడిన మట్టి కుండను (ఉట్టిని) కడతారు. చిన్నారులు లేదా యువకులు ఒకరిపై ఒకరు చేరి మానవ హారాలుగా ఏర్పడి ఆ కుండను పగులగొడతారు. పిల్లల కోసం తక్కువ ఎత్తులో ఉట్టిని ఏర్పాటు చేసి ఉల్లాసంగా ఆడిస్తారు. బాల కృష్ణుడి వేషధారణ ఇంట్లోని చిన్న పిల్లలను శ్రీకృష్ణుడిగా, రాధగా అలంకరిస్తారు. తలపై నెమలి పింఛం, చేతిలో పిల్లనగ్రోవి, కాళ్ళకు గజ్జెలు, పట్టు వస్త్రాలు ధరింపజేసి ఇంటిని గోకులముగా మారుస్తారు. కృష్ణుడి పాదాల ముద్రలను ఇంటి ముంగిట నుండి పూజా గది వరకు బియ్యపు పిండి తో చిన్న కృష్ణుడి పాదాల ముద్రలు వేస్తారు. బాలకృష్ణుడు తమ ఇంట్లోకి నడిచి వస్తున్నట్లుగా భావించి పిల్లలు ఈ ముద్రలపై నడుస్తూ ఆనందిస్తారు.

ఉట్ల పండుగ (ఉట్టి కొట్టడం ) కృష్ణాష్టమి అనగానే గుర్తొచ్చే ప్రధానమైనది వీధుల్లో ఎత్తైన ప్రదేశంలో పెరుగు, వెన్న,తీపి పదార్థాలతో కూడిన మట్టి కుండను (ఉట్టిని) కడతారు. చిన్నారులు లేదా యువకులు ఒకరిపై ఒకరు చేరి మానవ హారాలుగా ఏర్పడి ఆ కుండను పగులగొడతారు. పిల్లల కోసం తక్కువ ఎత్తులో ఉట్టిని ఏర్పాటు చేసి ఉల్లాసంగా ఆడిస్తారు.బాల కృష్ణుడి వేషధారణ ఇంట్లోని చిన్న పిల్లలను శ్రీకృష్ణుడిగా, రాధగా అలంకరిస్తారు. తలపై నెమలి పింఛం, చేతిలో పిల్లనగ్రోవి,కాళ్ళకు గజ్జెలు,పట్టు వస్త్రాలు ధరింపజేసి ఇంటిని గోకులముగా మారుస్తారు. కృష్ణుడి పాదాల ముద్రలను ఇంటి ముంగిట నుండి పూజా గది వరకు బియ్యపు పిండి తో చిన్న కృష్ణుడి పాదాల ముద్రలు వేస్తారు. బాలకృష్ణుడు తమ ఇంట్లోకి నడిచి వస్తున్నట్లుగా భావించి పిల్లలు ఈ ముద్రలపై నడుస్తూ ఆనందిస్తారు.చిన్నారుల పాటలు,నృత్యాలు ముద్దుగారే యశోద ముంగిట ముత్యము వీడన్నట్లు బాలకృష్ణుని అందాన్ని వర్ణించే అద్భుత ఆటాపాటలతో,పిల్లలు కోలాట నృత్యాలు చేస్తూ చక్కని సంకీర్తనతో నంద నందన గోపాలా..నవనీత చోర గోపాలా.. అనే పిల్లలు సులభంగా పాడుకునే చిన్న చిన్న భజన గీతాలు, జో జో ముకుందా రారా... పరమానంద రామ గోవిందా...” వంటి పాటలతో బాలకృష్ణుడిని ఊయలలో ఊపుతూ ఇంట్లోని చిన్నారుల వయస్సును బట్టి సరళమైన ఆటా పాటలతో అలరించడం ఆనవాయితీ.

## జూలూస్-ఏ-మొహమ్మదీ ర్యాలీ ప్రారంభం




**కొత్తగూడెం, సెప్టెంబరు 4 (తెలంగాణ వాణి):** విశ్వకారుణ్యమూర్తి, సర్వమానవాళికి మార్గదర్శకుడైన ప్రవక్త హజరత్ మహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం 1501వ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం రామవరం ప్రాంతంలో ముస్లిం సోదరులు జూలూస్-ఏ-మొహమ్మదీ శాంతియుత ర్యాలీ నిర్వహించారు. రామవరం 14వ నంబర్ మదీనా మసీదు నుంచి ప్రారంభమైన భారీ ర్యాలీని అంజుమన్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ డా. నయీమ్ ఖురేషి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రవక్త మహమ్మద్ జీవితంలో పాటించిన మానవతా విలువలు, శాంతి, సోదరభావం, సేవా భావాలను వివరించారు. కార్యక్రమంలో ఏడబ్ల్యూఎస్ జిల్లా అధ్యక్షుడు ఎండీ అమీర్ ఖాద్రి, శమీయుద్దీన్, ఫయీమ్ దాదా, ఖయ్యూం, ఎండీ జమాల్, బాబు జానీ, యూసుఫ్ బాబా, షఫీ, మసీదు నిర్వాహకులు, మైనారిటీ నాయకులు, ఇమామ్‌లు, వివిధ మసీదు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ సిటీ అపార్ట్‌మెంట్స్‌లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**తెల్లాపూర్, సెప్టెంబరు 4 (తెలంగాణ వాణి):**



తెల్లాపూర్‌లోని సైబర్ సిటీ అపార్ట్‌మెంట్స్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో సందడి చేశారు. ప్రత్యేకంగా నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పిల్లల ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అపార్ట్‌మెంట్ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు, కమిటీ సభ్యులు, మహిళలు, చిన్నారులు, నివాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.